

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై ఆ794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

(గతసంచికతరువాయి)

### బ్రిటిష్‌వారికి పేష్కను బకాయి

బ్రిటిష్ వారు అందించిన సర్క్యూట్ కమిటీ సిఫార్సుల మేరకు సంస్థానంలో సిబ్బందిని తొలగించి వారికి రావల్సిన బకాయిలను చెల్లించి పంపించి వేశారు. అంతవరకు సంవత్సరాల తలబడి దివాణాన్ని నమ్ముకుని పని చేసినవారు వెళ్ళలేక వెళ్ళారు.

ఈ వీడ్కోలు సమావేశం భారంగా జరిగింది.

విజయరామరాజు పుట్టుకతో మహరాజు కానందువల్ల అతనికి పేదరికం పేదల బతుకులు వారి జీవన విధానాలు అన్నీ తెలుసు. వారందరూ తమకు రావల్సిన పరిహారాలు తీసుకుంటున్నప్పుడు అతనికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చాలా సంవత్సరాలు పనిచేసిన ఒక సైనికుడు "రాజాసాబ్ మా తండ్రి అనారోగ్యం వల్ల ఈ ఉద్యోగంలో చేరాను. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ దివాణాన్ని నమ్ముకుని పనిచేస్తున్నాను. విజయనగరం. ఈ వాతావరణం నాకు చిన్నప్పటి నుంచి అలవాటు అయిపోయాయి. ఇప్పుడు ఉద్యోగం లేకుండా నేను ఎక్కడికి వెళ్ళాలో నాకే తెలియడంలేదు" అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని గొంతుక దుఃఖంతో పూడుకునిపోయింది.

విజయరామరాజు అతనికి ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు. అక్కడ ఉన్న వారిలో చాలామంది అదే పరిస్థితిలో ఉన్నారు. వాళ్ళ చేతుల్లో చిన్న సంచులు ఉన్నాయి. అందులో వారికి రావల్సిన పరిహారాల మొత్తాలను లెక్కకట్టి ఖజానా సిబ్బంది అందజేశారు.

"మీరంతా నా మనుష్యులు నాకోసం ఈ విజయనగరం సంస్థానం కోసం ఎన్నో సంవత్సరాలు చిత్తశుద్ధితో పనిచేశారు. మిమ్మల్ని ఎప్పుడూ మరిచిపోయేది లేదు. మీ సేవలు ఈ దివాణానికి కావాలి. కానీ బ్రిటిష్ పరిపాలకులు మనపైన కత్తి కట్టారు. మన రాజ్యాన్ని తక్కువ చేయాలని మన బలగాలను తగ్గించాలని ఈ విధంగా చేశారు. వారు మన దేశంలో ఉన్నంత కాలం మనని పరిపాలించినంత కాలం పరిస్థితి ఇదే విధంగా ఉంటుంది. మీరేమీ ఆందోళన చెందనవసరం లేదు. మీ సేవలు మీ అవసరం ఎప్పుడు కావాలన్నా పిలుపు వస్తుంది. తప్పకుండా ఈ దివాణానికి రావాలి" విజయరామరాజు గొంతు సవరించుకుని మెల్లగా చెప్పారు.

అతని మాటలు విన్న తర్వాత వారు "తప్పకుండా మహరాజా. తమరు ఎప్పుడు కబురు పెట్టినా రావడానికి మీకు అండగా నిలబడటానికి సిద్ధంగా ఉంటాం. మీ సేవకులుగా మీ ఉప్పు తిన్న మనుషులుగా మాకు ఆ విశ్వాసం ఉంది" అందులో ఉన్న ఓ వ్యక్తి చెప్పాడు.

దివాణంలో ఉన్న ఒక వ్యక్తి ఎంతమంది ఈ విధంగా ఇళ్ళకు వెళ్ళిపోతున్నారో వారి వివరాలను విజయరామరాజుకు అందించాడు. వాటిని కిందనుంచి పైవరకు ఒకసారి చూసి. "మీరు మీ కుటుంబాలతో సుఖసంతోషాలతో ఉండాలి. మీరు ధృఢంగా ఉన్నంత కాలం ఈ దివాణంలో పనిచేసే అవకాశం ఉంటుందని మీరూ మేమూ అనుకున్నాం. కానీ అనుకున్నది జరగలేదు. అయినా బాధపడవద్దు. మీరు ఈ రాజ్యంలో చివరివరకు పనిచేస్తే ఎంతటి ప్రయోజనం కలుగుతుందో అదంతా నగదుగా మీకు అందించడం జరిగింది. దీంతో వేరే విధంగా వ్యాపారాలు వ్యవసాయాలు చేసుకుని సుఖంగా బతకండి." విజయరామరాజు వారిని అనునయిస్తూ చెప్పాడు.

చాలామంది ఇంకా అక్కడినుంచి కదలడానికి ఇష్టపడటం లేదు.

"మన ఖజానాలో లోటు ఎక్కువగా ఉంది. రావల్సిన ఆదాయం రావడం లేదు. వచ్చిన సొమ్ములో బ్రిటిష్ వారికి చెల్లింపులు పోను మిగిలినది నిర్వహణకు అంతగా సరిపోవడం లేదు. అయినా ఇటువంటి పరిస్థితి వస్తుందని ముందుగా అనుకోలేదు. అందువల్ల చెల్లింపులు చేయవలసిన పేష్కను సొమ్ముని కూడా మీలో కొంతమందికి సర్దుబాటు చేయవలసి వచ్చింది. సంస్థానానికి చెందిన వ్యవసాయ భూములను కూడా సాగుకు అనుకూలంగా ఉన్నవాటిని అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. దివాణంలో పరిపాలనా

విభాగానికి చెందినవారు ఈ విషయాలను చూస్తున్నారు. అందులో కూడా తమకు న్యాయం జరుగుతుంది.'' మరి చెప్పడానికి ఏమీ లేదన్నట్లుగా చిన విజయరామరాజు మాటలను ముగించారు.

ఆ తర్వాత సిబ్బంది తగ్గించబడిన సైనిక బలగాలకు వీడ్కోలు పలికే కార్యక్రమాలను చేపట్టి వారిని సాగనంపారు.

ఆ సాయంత్రం.

దివాణం ప్రశాంతంగా ఉంది. వాతావరణంలో మార్పు లేకపోయినా ఉదయం నుంచి జరిగిన పరిణామాలు ఒకలాంటి నిశ్శబ్దాన్ని కలిగిస్తున్నాయి.

విజయరామరాజు అంతరంగికులతో సమావేశమయ్యారు.

తెల్లదొరలు తీసుకున్న బలగాలు తగ్గింపు నిర్ణయంవల్ల అంతవరకు ఎంతోమంది సిబ్బందితో కలకలలాడుతూ శత్రువులకు కూడా భయం కలిగించే విజయనగరం సంస్థానం చిన్నబోయినట్లుగా అనిపించింది.

''అసలు బ్రిటిష్ వారికి మనం ఎందుకు తల వంచాలి? ఎక్కడి వారు ఎక్కడికి వచ్చారు. మన స్వేచ్ఛను భంగం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు? వారి మాటను ఎదిరించడానికి అవకాశమే లేదా? ఎంతకాలం మౌనంగా చూడటం. వారు పంపించే కాగితాలకు తల వంచుకోవడం ఎన్నాళ్ళు సాగుతుంది. రానున్న పరిస్థితి ఇలాగే ఉంటుందా?'' ఒకలాంటి ఆవేదన, ఆవేశం విజయరామరాజు మాటల్లో తొంగి చూసింది.

అక్కడ ఉన్నవారు అతని మాటలకు బదులివ్వడం కానీ సమాధానం చెప్పడం కానీ చేయలేదు. మళ్ళీ విజయరామరాజే కలగజేసుకుని ''మన విజయనగరంపైనే వారి ప్రతాపం చూపిస్తున్నారు. ఇంతవరకు దుర్భేద్యంగా ఉన్న మన సంస్థానాన్ని బలహీనపరచడానికి ఈ సిఫార్సులను అమలు చేస్తున్నారని అనుకుంటున్నాను'' అని చెపుతూ ''మన బలగాలకు ఇవ్వవలసిన పరిహారాలన్నీ అందించాం. ఇప్పుడు బ్రిటిష్‌వారికి చెల్లించవలసిన పేష్కను కూడా కొంతమొత్తం ఖర్చుపెట్టడం జరిగింది. వారి నుంచి ఎప్పుడు సమాచారం వస్తుందో తెలియదు'' అన్నారు.

విజయరామరాజు మాటలకు ఆ రోజే సమాధానం లభించింది.

''గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం పంటలు వేసిన భూములకు, సాగు ద్వారా వస్తున్న ఆదాయంలో వాటా కోసం తమ సంస్థానం ఎంతో బకాయి పడింది. ఆ బకాయి లెక్కలను అధికారులు గత నాలుగురోజులుగా సరి చూస్తున్నారు. ఈ మొత్తం ఎనిమిది లక్షలుగా తేలింది. ఈ మొత్తన్ని తమరు తక్షణం జమ చేయవలసి ఉంది దీనిని జరూరు సమాచారంగా భావించాలి. ఈ పేష్కను సొమ్ముని ఎటువంటి మినహాయింపులు వాయిదాలు లేకుండా వెంటనే అప్పగించాలి. లేదన్నట్లయితే ఒప్పందం ప్రకారం మేము తీసుకోబోయే చర్యలకు తమరు బాధ్యులవుతారు'' అన్నది ఆ సమాచారం సారాంశం.

అక్కడున్న వారంతా ఇది విని కుతకుత ఉడికిపోయారు.

విజయరామరాజు సర్క్యూట్ కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించారు. మొదటిగా బ్రిటిష్ వారు సూచించిన విధంగా బలగాలను తగ్గించారు. ఆ పని ఇంకా పూర్తికాకముందే మళ్ళీ ఇప్పుడు పేష్కను సొమ్ముని చెల్లించాలని తాఖీదులు పంపడం విడ్డూరంగా అనిపించింది. మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయి కాబోలు అనుకున్నారు. అక్కడివారు కొంతమంది మనసులో బాధ పడితే మరికొంత మంది బైటికి వ్యక్తం చేశారు.

ఈ విషయం విన్న తర్వాత విజయరామరాజు మరింత ఆందోళనకు గురయ్యాడు. ఇప్పటివరకు బ్రిటిష్ వారికి చెల్లించవలసిన పేష్కను సొమ్ము సక్రమంగా వసూలు కావడంలేదు. వసూలు సొమ్ము నిర్వహణకు సరిపోవడంలేదు. ఉన్న సొమ్ము అంతా పదవుల నుంచి

తొలగించబడి ఇళ్ళకు పంపబడిన సిబ్బందికి చెల్లించడం జరిగింది. ఇంత సొమ్ము ఒక్కసారి ఎక్కడినుంచి తీసుకుని రావాలి. బ్రిటిష్ వారి ఖజానాకు ఎలా జమ చేయాలని అనే విషయాలు అతని మనసు నిండా ఆలోచనలు మేఘాల మాదిరిగా ముసురుకున్నాయి.

ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితులు చుట్టుముట్టాయి.

విజయరామరాజులో ఒకలాంటి నిరాశ నిర్లిప్తత ఆవరించాయి. బ్రిటిష్ వారు కక్షకట్టిన మాదిరిగా వరుసగా చేపడుతున్న కార్యకలాపాలు విజయనగర సంస్థానానికి ఇబ్బందిగా తయారవుతున్నాయి. రాజ్యపాలకునిగా వీటిని ఎలా పరిష్కరించాలి ఎల సరిచేయాలో అర్థంకావడం లేదు.

సైనిక సిబ్బంది తగ్గిపోవడం, రాజ్యపరిపాలనకు అవసరమైన నిర్వహణ సొమ్ము తగ్గిపోవడం బ్రిటిష్ వారికి పేష్కను పేరుతో జమ చేయవలసిన మొత్త లక్షలలో ఉండటంతో ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితులు ఏర్పడ్డాయని విజయరామరాజులో అంతర్గత మదనం మొదలైంది. ఈ సమస్యను ఎలాగైనా అధిగమించాలన్న పట్టుదల ధృఢనిశ్చయం అతనిలో పెరిగింది.

ఆ రకంగానే అతనిలో ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి.

***విజయనగరంలో అస్తవ్యస్థ పరిస్థితులు***

విజయనగరంలో దివాన్ సీతారామరాజు బలీయమైన శక్తిగా ఎదిగిపోవడం అతని చర్యలకు ఎదురు లేకపోవడంతో విజయనగరంలో అస్థవ్యస్థ పరిస్థితులు ఏర్పడ్డాయి. తనకున్న పరిచయాలు ఇతర ఆర్థిక అంగబలాలతో విజయనగరం చుట్టుపక్కల ఉన్న చిన్న సంస్థానాలపై యుద్ధం చేయడం వారిని సామంతులుగా చేసుకోవడం వారి నుంచి కప్పంగా నగదు జవహరీని తీసుకోవడం వంటి పనులు సీతారామరాజు చేసేవాడు అతని చర్యల వల్ల కళింగాంధ్రలో మిగతా సంస్థానాలపై యుద్ధం చేయడం వారిని సామంతులుగా చేసుకోవడం వారి నుంచి కప్పంగా నగదు జవహరీని తీసుకోవడం వంటి పనులు సీతారామరాజు చేసేవాడు అతని చర్యలవల్ల కళింగాంధ్రలో మిగతా సంస్థానాధీశులంతా అతనికి దాసోహం అనక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. దివాన్ నిరంకుశ వైఖరి పరాకాష్టకు చేరుకుంది పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే అతను దివాణంలో రాజబంధువులను కానీ విజయరామరాజును కాని బ్రిటిష్ కంపెనీ అధికారులను కానీ లెక్కచేయని స్థితికి చేరుకున్నాడు.

అటువంటి వ్యక్తి దివాన్ పదవిలో ఉండటం ఎవరికీ శ్రేయస్కరం కాదని అతడిని ఆ పదవి నుంచి ఎలాగైనా తప్పించాలని బ్రిటిష్ అధికారులు సీతారామరాజుపై వత్తిడి తీసుకుని వచ్చి పదే పదే సంకేతాలను పంపేవారు. వారి మాటలు విజయరామరాజుపై బాగా ప్రభావాన్ని చూపించాయి. ఎలాగైనా అన్నగారిని దివాన్ పదవి నుంచి తప్పించాలి. కానీ ఎలా? అని మదన పడేవాడు.

"తమతో మాట్లాడాలి. ఏకాంతమందిరానికి రాగలరా?" అన్నగారికి విజయరామరాజు కబురు చేసారు.

నలుగురు అనుయాయులతో దివాన్ సీతారామరాజు వచ్చాడు.

రాజ్యంలో జరుగుతున్న వివిధ అంశాలను మాట్లాడిన తర్వాత "అన్నయ్యా తమని దివాన్ పదవి నుంచి మార్పుచేయాలని అనుకుంటున్నాను" ఆగాడు.

తమ్ముడి మాటలు సీతారామరాజులో ఆశ్చర్యాన్ని కలిగించలేదు. బ్రిటిష్ కంపెనీ అధికారుల నుంచి వస్తున్న వత్తిళ్ళు అతనికి తెలియనివి కాదు. అందుకే ఏమీ మాట్లాడలేదు.

"నా నిర్ణయం తమకు ఇబ్బందికరంగా ఉండవచ్చు. కానీ రాజ్య సంక్షేమం కోసం తప్పనిసరిగా అమలు చేయవలసిన పరిస్థితి ఉంది" అన్నాడు.

"చిన రాజాగారు ఒక నిర్ణయం తీసుకుని మమ్మల్ని పిలిచారన్న విషయం అర్థం అయింది. మీ ఆలోచనను అర్థం చేసుకోగలను కానీ నా అభ్యర్థన కూడా తమరు వినాలి?"

"చెప్పండి"

"నర్సింహగజపతి తమకు తెలుసుకదా?"

"అవును. తమ సుపుత్రులు."

"దివాన్ పదవి నుంచి తప్పుకోవడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ తమ వారసునిగా నర్సింహగజపతి రాజుని తమరు అధికారికంగా ప్రకటించాలి."

అన్నయ్య మాటలు చిన విజయరామరాజుని కలవరం కలిగించాయి. అటువంటి ఆలోచన సీతారామరాజులో ఉందన్న విషయాన్ని కనీసం వూహించలేకపోయాడు. ఏమి చెప్పాలో తెలియలేదు. "ఇది చాలా కీలకమైన విషయం దివాణంలో కొంతమందితో ఆలోచించాలి. అప్పుడే నిర్ణయాని తెలియజేయగలను. ఏమైనా తమరు ఈ పదవిని వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి." అని లేచి నిల్చున్నాడు.

రాజు లేచి నిల్చుంటే అక్కడితో సంభాషణ పూర్తి అయినట్లే.

ఆ రోజంతా విజయరామరాజు దివాణంలో రాజబంధువులతో మాట్లాడాడు. దివాన్ ప్రతిపాదనను ఎవరూ అంగీకరించలేదు. ఇది చాలా కుట పూరితమైన ఆలోచనగా వారు చెప్పారు. అయినప్పటికీ కొన్ని సమస్యలు పరిష్కారం కావాలంటే కొన్ని వదులుకోవాలని విజయరామరాజు నిర్ణయించాడు.



విజయరామరాజు స్మారకంగా యుద్ధ క్షేత్రంలో నిర్మించిన కళావేదిక దీనిని రాజు పేరుతో నిర్మించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 20 సంవత్సరాల క్రితం నిర్మించారు ప్రస్తుతం వినియోగం లేక ఇది కూడా శిధిలం అయిపోయింది

ఇదే విషయాన్ని దివాన్ సీతారామరాజు కూడా ఎంతో ఆలోచన చేసాడు. విజయనగర రాజ్యానికి ఎంతో ఆర్థిక స్తోమతు కల్పించి సామంతరాజుల వద్ద గౌరవాన్ని పెంచిన తనకు ఇటువంటి బహుమానం వస్తుందని అనుకోలేదు. కానీ విజయనగర సంస్థానంపై తన ఆధిపత్యం నిలుపుకోవాలంటే తమ్ముడిపై ఘర్షణ పడాలి. ఇది బ్రిటిష్ కంపెనీకి లాభదాయకంగా మారి మొత్తానికే నష్టం వస్తుంది. అందువల్ల తను లాభపడి పదవి నుంచి తప్పుకోవడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు.

ఆ మర్నాడు విజయరామరాజు తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు.

తన వారసుడు నర్సింహగజపతి అని.

రాజప్రసాదంలో ఈ ప్రకటన అధికారంగా వెలువడగానే దివాన్ సీతారామరాజు తన పదవికి రాజీనామా చేస్తూ మహారాజుకు లేఖను సమర్పించాడు.

తర్వాత విశాఖపట్నం వెళ్ళిపోయాడు.

ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు బ్రిటిష్ కంపెనీకి చెందిన హవేలీ భూములను కౌలుకు తీసుకుని వాటిని సాగు చేస్తూ జీవనం గడపాలన్నది అతని ఆలోచన.

దివాన్ ఖాళీ చేసిన పోస్టు చాలారోజులు భర్తీ చేయలేదు.

అందరి ఆలోచనలతో గతంలో దివాణంలో మంచి సంబంధాలు కలిగిన వ్యక్తిగా పేరున్న జంపన జగన్నాధరాజుని దివాన్‌గా నియమించాడు.

దివాన్‌గా జగన్నాదరాజు పదవిలోకి రాగనే కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

జగన్నాధరాజు కూడా పాత దివాన్ సీతారామరాజుకు ఏమీ తీసిపోని వ్యక్తిగా పేరు తెచ్చుకుని కొద్దికాలంలోనే తెరమరుగైపోయాడు.

విశాఖపట్నంలో ఉన్న బ్రిటిష్ కంపెనీ అధికారులతో చాలా విషయాలలో కలిసిపోయి వారికి అనుకూలమైన నిర్ణయాలను తీసుకున్నాడు. 1776లో అక్కడి అధికారుల అండదండలతో అక్కడే హవేలీ భూముల వ్యవహారాలను చూస్తున్న సీతారామరాజుని ఆ పదవి నుంచి తప్పించాడు. దివాన్ పదవితో పాటు అనకాపల్లి సంస్థానం ఆర్థికంగా బాగుండటంతో దానికి మేనేజరుగా నియమింపజేసుకున్నాడు. వెంటనే వెళ్ళి ఆ బాధ్యతల్ని కూడా తీసుకున్నాడు ఆ సమయంలో దాని పరిధిలో ఉన్న రెంటసీమ, లోవసీమ, నరవసీమ జమిందారీలను కూడా సంపాదించాడు. ఈ విషయాలన్నీ తెలుస్తున్నా విజయరామరాజు ఏమీ అనలేని అసక్తుడిగా ఉండిపోయడు. కొత్త దివాన్ చర్యలు విజయనగరం సంస్థానం ప్రతిష్ఠమంట గలిపే మాదిరిగా ఉందని భావించి. దివాణంలో చాలామందితో సంప్రదింపులు జరిపాడు. కొత్త దివాన్ కన్నా పాత దివానే నయమన్న ఆలోచనతో జంపన జగన్నాధరాజుని ఆ పదవి నుంచి తొలగించి విశాఖలో ఖాళీగా ఉన్న తన అన్నగారైన పాత దివాన్ సీతారామరాజుని మళ్ళీ దివాన్‌గా నియమించాడు.

సీతారామరాజు విజయనగరం కోటలో మళ్ళీ పునప్రవేశించాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments